## ఎం ఎల్ ఏ వీర్లపల్లి శంకర్ వివాదాస్పద వాక్యాల పై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన బీ ఆర్ ఎస్ శ్రేణులు




రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -08(అక్షరం న్యూస్ )

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీ ఆర్ ఎస్ అధినేత కేసి ఆర్ ను ఉద్దేశించి షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ (వీర్ణపల్లి శంకర్) చేసిన వివాదాస్పద వ్యాఖ్యల పై ముస్తాబాద్ మండల బీ ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అతని పై క్రిమినల్ కేసు పెట్టి చట్య రీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్ ఐ జ్యోతి కి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇది వీర్లపల్లి శంకర్ వ్యక్తిగత మాటలు కావని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే ఇలా మాట్లాడించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, స్పీకర్ ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొంపెల్లి సురేందర్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ముస్తాబాద్ పట్టణ పార్టీ అధ్యక్షులు ఏద్దండి నరసింహ రెడ్డి అధ్యక్షుడు శీలం స్వామి, పార్టీ సీనియర్ నాయకులు కొండ శ్రీనివాస్ గౌడ్, మాధవనేని ఆనందరావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు అన్వర్, గూడూరి భరత్, కొమ్మెట రాజు, కోడె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ నిర్ణయాలు

•అభివృద్ధికి నిధుల ఆమోదం..



సూర్యాపేట/నేరేడుచర్ల, సెప్టెంబర్ 8: అక్షరం న్యూస్:

కొణతం వెంకట్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పురపాలక సంఘ సాధారణ సమావేశంలో చర్చకు వచ్చిన 17 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఆయా అంశాలకు సంబంధించి మొత్తం రూ.18.75 లక్షల నిధుల వినియోగానికి అనుమతి ఇచ్చింది.పురపాలక సంఘ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కుక్కలను పట్టుకుని శస్త్రచికిత్సలు, జనన నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రానికి తరలించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.సమావేశంలో వైస్‌ఛైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మిషన్ భగీరథ ఏఈ, టీజీఎస్‌పీడీసీఎల్ జేఈ, పురపాలక కార్యాలయ అధికారులు, విలేకరులు పాల్గొన్నారు.

## కర్బూజతో ఎన్నో లాభాలు.. తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు

వేసవిలో భానుడు భగభగమంటున్నాడు. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండటంతో శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సమయంలో ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన వరం 'కర్బూజ'(Muskmelon). ఇందులో 95% వరకు నీరు, విటమిన్ సి, పొటాషియం పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, గుండె ఆరోగ్యాన్ని రక్షించడం, బరువు తగ్గడంలో ఇది సహాయపడుతుంది.

### 1.డీహైడ్రేషన్ నుంచి రక్షణ:

ఎండల వల్ల శరీరం త్వరగా నీటిని కోల్పోతుంది. కర్బూజ తినడం, జ్యూస్ చేసుకొని తాగడం వల్ల శరీరానికి అవసరమైన నీరు అంది, రోజంతా ఉత్తేజంగా ఉండటానికి సహాయపడుతుంది.

### 2. రక్తపోటు నియంత్రణ:

కర్బూజలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచడమే కాకుండా, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

### 3. జీర్ణక్రియకు మేలు:

ఇందులో పీచు పదార్థం (ఫీఅఎవతీ) ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకం సమస్యను తొలగించి, జీర్ణ వ్యవస్థను శుభ్రంగా ఉంచుతుంది. అసిడిటీ సమస్యతో బాధపడేవారికి ఇది మంచి ఔషధం.

### 4. కంటి చూపు మెరుగుపరుస్తుంది:

కర్బూజలో ఉండే విటమిన్-ూ, బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపరచడంలో తోడ్పడతాయి. వయసు రిత్యా వచ్చే కంటి సమస్యను ఇది నివారిస్తుంది.

### 5. చర్మ సౌందర్యం:

ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తాజాగా ఉంచుతాయి. ఇది చర్మంపై ముడతలను తగ్గించి, సహజమైన కాంతిని ఇస్తుంది.

### 6. బరువు తగ్గడం:

కర్బూజలో క్యాలరీలు చాలా తక్కువ, కానీ ఫైబర్ ఎక్కువ. ఇది తన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. తద్వారా అనవసరమైన ఆహారం తీసుకోకుండా బరువు తగ్గడానికి సహకరిస్తుంది.

# తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

•దోసపహాడ్ ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రతిపాదనలు

•మిషన్ భగీరథ లోపాలపై సమీక్ష.. ట్యాంకర్లతో ప్రత్యామ్నాయ సరఫరా

•పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం.. కొత్త మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం



సూర్యాపేట, టౌన్ సెప్టెంబర్ 8: అక్షరం న్యూస్

సూర్యాపేట పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు.మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ విద్యుత్ అంతరాయం, మోటార్ల మరమ్మతులు, పైపులైన్ లీకేజీల కారణంగా అప్పుడప్పుడు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. భవిష్యత్‌లో నీటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో వినియోగంలో ఉన్న దోసపహాడ్ ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. మిషన్ భగీరథ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి నీటి సరఫరా సమస్యలను గుర్తించినట్లు తెలిపారు.ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా 9 నుంచి 10 నీటి ట్యాంకులను నింపి వివిధ వార్డులకు సరఫరా చేస్తున్నామని, అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయంగా నీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వ స్థాయిలో నిరంతరం ప్రయత్నిస్తున్నామని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయి నీటి సమస్య ఏర్పడిందన్నారు. మూసీ అధికారులతో మాట్లాడి సద్దుల చెరువును నింపినట్లు, దీంతో చుట్టుపక్కల వార్డుల్లో బోర్లకు కొంతమేర నీటి లభ్యత పెరిగిందని వివరించారు.

కౌన్సిలర్లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధులు ఫోన్ చేసినప్పుడు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా స్పందించాలని కమిషనర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ రహదారి--65 కింద ఉన్న 60 అడుగుల రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు అనుసంధాన రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణు తెలిపారు. ఈ ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అందించాలని సమావేశంలో నిర్ణయించారు.పట్టణంలోని సుందరయ్యనగర్‌లో లీకేజీ సమస్యను పరిష్కరించాలని 3 నెలలుగా కోరుతున్నా చర్యలు తీసుకోవడం లేదని 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి దిలీప్‌రెడ్డి పేర్కొన్నారు. మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ వి. రామమూర్తి పట్టణ అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సహకరించాలని కోరారు.38వ వార్డు కౌన్సిలర్ గండూరి రమేష్ రోడ్లపై పశువుల సంచారాన్ని అరికట్టాలని, టెలికాం సంస్థలు పనుల కోసం తవ్విన గుంతలను వెంటనే పూడ్చాలని కోరారు. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మాత్రమే సరుకుల అన్‌లోడింగ్‌కు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యంపారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కార్మికులకు ప్రతి సంవత్సరం అందించే సబ్బులు, దుస్తులు, కొబ్బరి నూనె తదితర సామగ్రిని అందించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గత 4 సంవత్సరాల 9 నెలలుగా పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న 120 మంది పారిశుద్ధ్య కార్మికుల మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు.

### కొత్త మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం

సూర్యాపేట పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణ విస్తరణ, రహదారులు, మౌలిక వసతులను పరిగణనలోకి తీసుకున్న ఈ ప్రణాళిక భవిష్యత్ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని సమావేశంలో నిర్ణయించారు. ఎజెండాలోని అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ ఎండీ షఫీ ఉల్లా, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు ఈఈ కిరణ్, పబ్లిక్ హెల్త్ డీఈలు రమాదేవి, అనిల్, ప్రణయ్‌రెడ్డి, మేనేజర్ బుచ్చిబాబు, ఆర్వో జ్ఞానేశ్వరి, గౌస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్ ను అవమానించడంపై ముస్తాబాద్‌లో కాంగ్రెస్ నిరసన

రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -08(అక్షరం న్యూస్ )

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌పై చర్యలు తీసుకోవాలని ముస్తాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కళ్ల కు నల్ల రిబ్బన్ కట్టుకొని ప్రధాన రహదారి గుండా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. స్పీకర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు రాజకీయంగా, విధానపరంగా ఉండాలే తప్ప వ్యక్తిగత



దూషణలకు దిగడం సరికాదని అన్నారు. ఎమ్మెల్సీ పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడాల్సిన భాష ఇదేనా అని ప్రశ్నించారు.తాతా మధుసూదన్‌ను ఎమ్మెల్సీ పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు.బీ ఆర్ ఎస్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్‌తో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారుగౌరవ ప్రధమైన ఉన్నత స్థాయిలో ఉన్న స్పీకర్ పై పరుశ పదజాలం ఉపయోగించడం దూర్మార్గం అన్నారు. లేని పక్షం లో నిరసన లు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు, ఎన్ ఎస్ యూ ఐ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కాఫీ తాగితే లివర్ క్యాన్సర్ దూరమవుతుందా?

క్రమం తప్పకుండా కాఫీ తాగడం వల్ల శరీరానికి కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉండొచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కాఫీ తాగడం వల్ల కాలేయం (లివర్) ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. చాలా మందికి ఉదయం లేవగానే కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కాఫీ తాగడం వల్ల ఉత్సాహం కలగడంతో పాటూ ఏకాగ్రత కూడా పెరుగుతుంది. అంతేకాకుండా, శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో ఒకటైన లివర్‌ను రక్షించడంలో కూడా కాఫీ కొంతవరకు సహాయపడవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.



పరిశోధనలు ఏం చెబుతున్నాయి?

నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ చేసిన ఒక అధ్యయనం ప్రకారం, రోజుకు రెండు కప్పుల వరకు కాఫీ తాగే వారిలో సాధారణంగా కనిపించే కాలేయ క్యాన్సర్ హెపాటోసెల్యులర్ కార్సినోమా వచ్చే ప్రమాదం దాదాపు 35 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని తేలింది. ఈ పరిశోధనలో మద్యం సేవించడం, హెపటైటిస్ ఇన్ఫెక్షన్, అలాగే బాడీ మాస్ ఇండెక్స్ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఈ ఫలితాలు వచ్చినట్లు నిపుణులు తెలిపారు.

కాఫీ ఎలా సహాయపడుతుంది?

కాఫీ కేవలం కెఫిన్ ఉన్న పానీయం మాత్రమే కాదు. ఇందులో పాలీఫెనాల్స్, డైటర్పెన్స్, యాంటీఆక్సిడెంట్లు వంటి శరీరానికి ఉపయోగకరమైన వందలాది సమ్మేళనాలు ఉంటాయి. నిపుణుల ప్రకారం ఇవి శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తాయి. కాలేయ ఎంజైమ్ స్థాయిలను మెరుగుపరుస్తాయి. దీని వల్ల కాలేయ సంబంధిత వ్యాధులు, కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కొంతవరకు తగ్గవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

రోజుకు ఎంత కాఫీ తాగాలి?

నిపుణుల సూచన ప్రకారం రోజుకు 2 నుంచి 4 కప్పుల వరకు మితంగా కాఫీ తాగడం ఆరోగ్యానికి మంచిదిగా భావిస్తున్నారు. ఫిల్టర్ కాఫీ అయినా, ఇన్‌స్టంట్ కాఫీ అయినా ప్రభావం దాదాపు ఒకేలా ఉండొచ్చు. అయితే అధికంగా కాఫీ తాగితే జీర్ణ సమస్యలు, నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

# నోటీసులు జారీ అయిన ఓటర్లు హియరింగ్‌కు రావాలి

- 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎస్ఐఆర్ లో భాగంగా ముస్తాబాద్ మండలం చీకోడులో హియరింగ్ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్/, సెప్టెంబర్ -08(అక్షరం న్యూస్ )

ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ )లో భాగంగా నోటీసులు జారీ అయిన ఓటర్లు హియరింగ్ కు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోతో తప్పనిసరిగా రావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ )లో భాగంగా

ముస్తాబాద్ మండలం చీకోడులో హియరింగ్ మంగళవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కింద మండలంలో నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లు ఎందరు ఉన్నారని? నూతన ఓటర్లు ఎందరు దరఖాస్తు చేసుకున్నారో ఆరా తీశారు. మండలం మొత్తం 7,005 మంది నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కింద ఆయా ఓటర్లకు బూత్ లెవల్ అధికారి(బీ ఎల్ ఓ) ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డులో ఏదైనా ఒకటి తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో హియరింగ్ సమావేశాలు నిర్వహించాలని, బీ ఎల్ ఏ లు తమ పరిధిలో నోటీసులు అందుకున్న వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అందరూ హాజరయ్యేలా చూడాలని తెలిపారు. తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్ వైజర్లు అన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించాలని ఆదేశించారు. బీ ఎల్ ఓ లు ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 12.09.2026 (శనివారం), 13.09.2026 (ఆదివారం) లలో ఓటరు నమోదు ప్రత్యేక ప్రచార కార్యక్రమము నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఓటరు నమోదు అధికారుల (ఈఆర్ఓ/ ఏఈఆర్ఓ) కార్యాలయాల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాలతో పాటు, ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా తమ క్లెయిమ్‌లు కూడా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.

సమావేశంలో ఆర్డీవో శ్రీధర్ బాబు, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు. గ్రామ సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు,పంచాయతీ పాలక వర్గం, తదితరులు పాల్గొన్నారు.

# 15 టన్నులు రూ. 3,45,000 లక్షల ఆదాయం

- ముస్తాబాద్ మండలం నామాపూర్ లో ఏడు ఎకరాల్లో రైతు ఆయిల్ పామ్ సాగు
- ప్రస్తుతం రెండు ఎకరాల్లో మామిడి, నిమ్మ తోట సాగులి
- పరిశీలించి అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్/సెప్టెంబర్ -08(అక్షరం న్యూస్ ),

ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి దాదాపు నాలుగు ఏండ్ల తరువాత 15 టన్నుల దిగుబడితో రూ.3,45,000 ఆదాయం పొందారు ముస్తాబాద్ మండలం పోతుగల్ కు చెందిన రైతు ఎర వెల్లి చంద్రశేఖర్ రావు. దాదాపు నాలుగు ఏండ్ల క్రితం మొక్కలు నాటి సస్య రక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడి సాధించి.. ఇప్పుడు మరో రెండు ఎకరాల్లో మామిడి, నిమ్మ తోటలు సాగు చేస్తున్నారు.

ఈ ఆదర్శ రైతు వ్యవసాయ క్షేత్రానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం వెళ్లి పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో మొక్కలు, దిగుబడిని పరిశీలించి..మరో పంట ఎప్పుడు చేతికి వస్తుందని అడిగి తెలుసుకున్నారు.

ఎన్ని ఎకరాల్లో ఆయిల్ పామ్ వేశారు? మొక్కలు ఎక్కడి నుంచి తీసుకున్నారు? డ్రిప్ ఇరిగేషన్.. సస్య రక్షణ చర్యలు, పెట్టుబడి.. ఆదాయం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఆ రైతును అభినందించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతులు దీర్ఘకాలిక ఆదాయం సమకూర్చే ఆయిల్ పామ్ వైపు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీ పై అందించే మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మూడు ఏండ్లపాటు అంతర పంటలుగా ఉద్యానవన శాఖా అధికారుల సూచనల మేరకు కూరగాయలు, పూల మొక్కలు, పండ్ల మొక్కలు సాగు చేసి ఆదాయం పొందవచ్చని స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ సాగులో కోతుల బెడద, చీడపీడల ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఇప్పుడు ఆయిల్ టన్ను ధర 24 వేల 25 రూపాయలుగా ఉందని వెల్లడించారు. జిల్లాలో ఆయిల్ పామ్ కలెక్షన్ కేంద్రాలు నామాపూర్, బోయినపల్లి, నేరెళ్ల, సిరిసిల్ల ఉన్నాయని వెల్లడించారు. ఇక్కడి ఆయిల్ పామ్ ఉత్పత్తులు సిద్ధిపేట జిల్లాలో ఉన్న నర్మెట్ట వద్ద ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారని తెలిపారు. ఎక్కువ మంది రైతులు ఆయిల్ సాగు చేసేందుకు ముందుకు వస్తే మరిన్ని ఆయిల్ పామ్ కలెక్షన్ కేంద్రాలు ప్రారంభిస్తారని వివరించారు. ఎన్నో లాభాలు ఉన్న ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. నామాపూర్ రైతు ఆయిల్ పామ్ తో పాటు ఇప్పుడు మామిడి, నిమ్మ తోట సాగు చేస్తున్నారని, దీంతో మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉందని తెలిపారు. ఈ

కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఏడీఏ ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు తదితరులు ఉన్నారు.

# పట్టుబిగించిన ఈస్ట్ జోన్..

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖురైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు



ఆశించిన ఆరంభం దక్కలేదు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.

## నెట్‌ఫ్లిక్స్‌లోకి త్వరలో 'విశ్వనాథ్ అండ్ సన్స్'



'వీరభద్రుడు' (తమిళంలో 'కరుప్పు') విజయం తర్వాత కోలీవుడ్ స్టార్ సూర్య కథానాయకుడిగా నటించిన సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. ఇందులో మమితా బైజు కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలపై వచ్చిన ఈ కుటుంబ కథా చిత్రం థియేటర్లలో భారీ విజయాన్ని సాధించింది. ఇక ఇప్పుడు ఓటీటీలో విడుదలకు రెడీ అయ్యింది. ఈ వారమే స్ట్రీమింగ్ కానుంది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఇంటర్నేషనల్ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ డేట్‌ను నెట్‌ఫ్లిక్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. సెప్టెంబర్ 11వ తేదీ నెట్‌ఫ్లిక్స్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు భాషల్లో థియేట్రికల్ రిలీజ్ చేశారు. ఇప్పుడు ఆ రెండు భాషలతో పాటు హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోనూ స్ట్రీమింగ్ చేయనున్నారు. 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాకు మొదటి రోజు నుంచి పాజిటివ్ టాక్ లభించింది. థియేటర్లకు జనాలు భారీగా వచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు రూ. 260 కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసిందని ట్రేడ్ వర్గాల టాక్. సూర్య, మమితా బైజు జంటగా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో సీనియర్ నటి రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, సునీల్ రెడ్డి, నాజర్, హర్ష చెముడు, హారిక తదితరులు ప్రధాన పాత్రలలో కనిపించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని సమకూర్చారు. ఈ సూపర్ హిట్ ఫ్యామిలీ డ్రామా ఓటీటీ వీక్షకులను ఎంత వరకు మెప్పిస్తుందో చూడాలి.

## ఆదర్శ కుటుంబం వాయిదా



విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఆదర్శ కుటుంబం'. ఈ కాంబినేషన్ కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, బ్రహ్మాజీ, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అయితే గత కొన్ని రోజులుగా సినిమా రిలీజ్‌పై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి. అప్‌డేట్స్ ఆలస్యం కావడంతో సినిమా అక్టోబర్ 2న విడుదల కాకపోవచ్చనే ప్రచారం జరిగింది. అక్టోబర్ 16కు వాయిదా పడుతుందనే వార్తలు కూడా వినిపించాయి. దీంతో వెంకీ అభిమానుల్లో సందేహాలు మొదలయ్యాయి. ఈ రూమర్లకు నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెక్ పెట్టారు. అప్‌డేట్స్ ఆలస్యమైనందుకు అభిమానులకు క్షమాపణలు చెప్పారు. అదే సమయంలో 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తుందని స్పష్టం చేశారు. గాంధీ జయంతితో పాటు దసరా సెలవులు కూడా కలిసిరావడంతో ఈ రిలీజ్ డేట్ సినిమాకు ప్లస్ అయ్యే అవకాశం ఉంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కావడంతో పండుగ సీజన్‌లో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. సినిమా రిలీజ్‌కు ముందు నెల రోజుల పాటు భారీ ప్రమోషనల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. దీనికి చాఖ47వీశీత్ష్ర అనే పేరు పెట్టారు. ప్రతి వారం కొత్త కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. నాగవంశీ వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం వచ్చే వారం ప్రారంభంలో టీజర్ విడుదల కానుంది. రెండో వారంలో ఫస్ట్ సింగిల్ రానుంది. సెప్టెంబర్ చివరి వారంలో థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేయనున్నారు. ఇవే కాకుండా ప్రతి వారం ఒక మ్యూజికల్ కంటెంట్‌ను కూడా విడుదల చేయనున్నారు. దీంతో సినిమా రిలీజ్ వరకు సోషల్ మీడియాలో బజ్ కొనసాగించేలా ప్లాన్ చేశారు.

## నగ్నంగా నిలబెట్టేవారు..

సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్, నటి సందీపా విర్క్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత భయానకమైన దినాలను గుర్తుచేసుకుని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రూ.6 కోట్ల మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి సందీపా విర్క్ దాదాపు నాలుగున్నర నెలల పాటు ఢిల్లీలోని తీహార్ జైలులో గడపాల్సి వచ్చింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సందీపా విర్క్.. జైలులో తాను అనుభవించిన దారుణ పరిస్థితులను, అవమానాలను బయటపెట్టారు. జైలులో ఖైదీలను తనిఖీ చేసే పద్ధతి అత్యంత అమానుషంగా ఉంటుందని సందీపా చెప్పుకొచ్చారు. లోపలికి వెళ్లగానే సిబ్బంది బట్టలు విప్పించి ప్రైవేట్ పార్టులపై టార్చ్ లైట్ వేసి తనిఖీ చేస్తారని.. చలికాలంలోనూ ఇష్టారీతిన దుస్తులు తొలగించి అవమానిస్తారని వాపోయారు. ఇంత కఠినంగా శరీరాన్ని తనిఖీ చేస్తున్నప్పుడు జైలు లోపలికి మొబైల్ ఫోన్లు, డ్రగ్స్ ఎలా వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. జైలులో డబ్బు ఉంటే ఏదైనా సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక రోజులోనే రెండు మూడు సార్లు దుస్తులు ఊడదీసి తనిఖీలు చేసేవారని.. ఆ వందలాది తనిఖీల సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని సందీపా విర్క్ వెల్లడించారు. "మహిళా సిబ్బందే కదా చూస్తోంది, దుస్తులు తీస్తే తప్పేంటి?" అని కొందరు తేలికగా మాట్లాడుతున్నారని సందీపా విర్క్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609